# వథ

అది మహారణ్యం.

అందు కొన్ని మహావృక్షాలు వేడినీ వెలుతుర్నీ వెతుక్కుంటూ ఆకాశంలోకి చొచ్చుకుపోతాయి. వాటి వేర్లు పాతాళం వరకు వ్యాపించాయి. వాటి మానులు లావుగా చేవదేరి శతాబ్దాలూ, సహస్రాబ్దాలూగా పెరుగుతున్నట్టున్నాయి. మరికొన్ని మహావృక్షాలు అడ్డంగా విస్తరిస్తున్నాయి. వాటి కొమ్మలు మూలల జారిపడుతున్న వెలుగును దారిలోనే అందుకుని త్రాగుతున్నాయి. అందు కొన్నింటి శాఖలూ, కొమ్మలూ వాటి ఊడల్ని దింపుకుంటూ మొదలును విడిచి మొదలు కూడా లేనట్టు చాలా దూరం వరకూ వ్యాపించాయి. ఆకాశం మీది పొరనంతా శాఖోపశాఖలుగా అల్లుకొని ఎక్కడ చూచినా తాముగా ఉన్నాయి.

ఈ రెండు రకాల వృక్షాల నీడనూ మిగిలిన చెట్లూ పొదలూ మొక్కలూ తీగలూ అల్లిబిల్లిగా అల్లుకొని వెలుతురూ నీళ్ళూ కోసం మూలమల్లా వేళ్ళు చేసుకొని, మొదలల్లా కొమ్మలు చేసుకొని, కొమ్మలల్లా ఆకులు చేసుకొని, ఆకులల్లా హరితం చేసుకొని, తనువెల్లా బ్రతుకు చేసుకొని, బ్రతుకల్లా బ్రతుకు చేసుకొని సతమత మౌతుంటాయి.

ఆ చెట్లలో కొన్ని కెంపులు పూస్తాయి. కొన్ని మొక్కలు పచ్చని పసుపురంగు పువ్వులు పూస్తాయి. కొన్ని తెల్లని నిర్గంధ కుసుమాలు గుత్తులు గుత్తులుగా విరబూస్తాయి. మరికొన్ని చిన్న చిన్న మొక్కలూ, తీగలూ రకరకాల సువాసనలిచ్చే రంగు రంగుల పువ్వులు పూస్తాయి. వాటిల్లో కొన్ని అందమైనవి వుంటాయి. కొన్ని కుంటివీ, గ్రుడ్డివీ వుంటాయి. కొన్నిపువ్వులు అందంగానే కాక ఆరోగ్యంగా కూడా ఉంటాయ్.

మొక్కలూ తీగలూ చెట్లూ కాయలూ కాస్తాయ్! అవన్నీ ఆకుపచ్చగా ఉంటాయ్. ఆ ఆకుపచ్చని కాయలు ముదిరి రంగు రంగుల పండ్లవుతాయ్.మహావృక్షాలు చాలా వరకూ పూవులు పూయవ్. కొన్ని పూసినా అవి కాయలు కాయవ్. కొన్ని కాసినా వాటి పళ్ళు ఆ వనాన్ని అంటిపెట్టుకుని ఉండే జీవరాశికి ఎందుకూ పనికిరావు.

అక్కడ తేనె కోసం వెదుక్కునే ఈగల ఝుంకారం ఎడతెగని శృతిగా ఉంటుంది. పండ్లూ, లేత చివుళ్ళూ తిని కైపెక్కిన పక్షిజాతి కంఠానెత్తి కమ్మ కమ్మగా పాడుతూ ఉంటుంది.

నరులను బోలిన వానరులు పెక్కురుంటారు. ఆ అడవిలో లేళ్ళూ, దుప్పులూ, ఎనుములూ మొదలైనవి మందలు మందలుగా తిరుగుతాయి. వాటి పెద్ద పెద్ద కళ్ళు ఎప్పుడు ఎటు చూసినా బెదురు చూపులే చూస్తాయి. పులులూ, సింహాలు, సివంగులూ, చిరుతలూ కూడా ఆ అరణ్యంలో ఉంటాయి. అవి ఒంటిగానో జంటగానో తప్ప మందలుగా ఉండవు. ముసలితనం వల్లా, గాయపడీ దెబ్బతినీ ఒంటరిగా వేటాడే శక్తి తగినంత లేని మృగాలు కొన్ని చిన్న చిన్న మందలుగా కనబడుతాయి. అవి వేటాడేటప్పుడు కలసికట్టుగా ఉంటాయి. తరువాత ఆ వేట కోసం అవి తరచు తమలో తాము భయంకరంగా కలహించుకుంటాయి.

ఆ అడవిలో ఎలుగ్గొడ్లూ, దుమ్మల గొండ్లూ పందులూ, పందికొక్కులూ, చారల మృగాలూ, ఏనుగులూ మొదలైనవి ఎన్నో ఉన్నాయి. మహావృక్షాల నాశ్రయించి వాటి కొమ్మల్లో జీవించే కొంగల్నీ కోతుల్నీ మింగుతూ కొండచిలువలు బ్రతుకుతాయి. వాటి మొదళ్ళనున్న పుట్టల్లో త్రాచులూ, నాగులూ ఆ చెట్ల తొర్రల్లోను కొమ్మల్లోనూ దొరికే పక్షుల గ్రుడ్లూ పిల్లలతోనూ వాటి క్రింద బొరియల్లో బ్రతికే ఎలుకలూ మొదలైన వానితోనూ పొట్ట పోసుకుంటూ ఉంటాయి. వాటి చుట్టూ ఉండే పొదల్లో తుప్పల్లో నెరియల్లో పుట్టల్లో బొరియల్లో తేళ్ళూ మండ్రగబ్బలూ చలిచీమలు పురికొనలూ బ్రతుకుతుంటాయి.

సామాన్యంగా నాగరికులు ఆ అడవి సమీపానికి కూడా పోవడానికి జంకుతారు. అందక్కడక్కడా ఉండే ఆటవికులు మెకాలు బెదిరినప్పుడు తప్ప మీది మీదికి రావంటారు. జడియకుండా జడిపించకుండా తమ దారిన పోయే వారిని మృగాలు ఏమీ చేయవని వారు చెపుతారు. కొన్ని మున్యాశ్రమాలు ఆ అడవిలో అక్కడక్కడా కానవస్తాయి. ఆత్మను పరమాత్మయందు లయించి అక్షులు మోడ్చి తపస్సమాధి నున్న ఆ ముముక్షువుల సమక్షంలో జంతువులు చేష్టలు దక్కి జాతి వైరం మరచి సాగిలి ప్రణతులు చెల్లించి అక్కణ్ణుంచి తిరిగి పోతుంటాయిట. కొందరు దివ్యులు అప్పుడప్పుడూ విమానాల్లో ఎక్కినవారై ఆ అరణ్యం మీదగుండా పోతుంటారు. వారికా అరణ్య సౌందర్యం యెంత యత్నించినా వర్ణింపరానిదిగా తోస్తుంది. ఎత్తైన పర్వతాలపై పర్వతాల మధ్య లోయల్లో సమప్రదేశాలలో మిట్ట పల్లాలుగా మధ్య మధ్య నదులూ ఉపనదులూ జలపాతంలో అక్కడక్కడ చిన్న చిన్న జనపదాలలో యెన్నో యోజనాలుగా వ్యాపించి ఉన్న పచ్చని ఆ అరణ్యం రమణీయత నందన వనాల కృత్రిమ సౌందర్యాలను అవహేళన జేస్తుంది. ఆ అరణ్యంలో ఏ మూలనో ఒక మూలన ఎప్పుడూ కార్చిచ్చు కాలుతూనే

ఉంటుంది. అయినా తక్కిన అరణ్యమంతా తనకు పట్టనట్టు పచ్చగా కలకలలాడుతూ చూపరులకు సృష్టికర్త వైచిత్రి చాటుతూనే ఉంటుంది. అదే దానిలోని సొబగు.

అలాంటి ఆ అరణ్యంలో ఒక జనపదానికి ఎల్లలోనున్న ఒక ఎత్తైన ప్రదేశాన ఒక విశాలమైన వృక్షం ఉన్నది. ఆ వృక్షం క్రింద ఒంటరిగా ఒక మహామానవుడున్నాడు. అతడు పొడవైన వాడు. అతడు బలమైన వాళ్ళల్లో చాలా బలమైన వాడు. అతడి శరీరం నలుపు రంగుకు అందాలను అమరుస్తోంది. అతని మూపున అమ్ముల పొదీ, చేతను విల్లూ ఉన్నాయి. అతడు నార బట్టలు కట్టుకొన్నాడు. అతడి నెత్తిన శిరోజాలే కిరీటంగా అమరి ఉన్నాయి. అమ్ముల పొది చాటున ఉపవీతం మరుగుపడి ఉన్నది. అతని ముఖం కనిపించక పోయినా తల వాల్చి నిల్చున్న పద్ధతి వల్ల అతను ఏదో తెలీని మథనలో తలమునకలుగా ఉన్నాడని తెలుస్తుంది.

అతడి సమీపంలో ఇంకొక చెట్టు క్రింద మరి ఒకడున్నాడు. వాడు ముమ్మూర్తులా మొదటి వాడిని పోలి ఉన్నాడు. వాడి వయసు కూడా మొదటి వాడి వయస్సే. రంగు మాత్రం మెరిసే బంగారం రంగు. వాళ్ళిద్దరూ ఒకరి సరసను ఒకరుండే మేఘం మెరుపులా ఉంటారు.

రెండవవాడు అదేపనిగా క్రిందనున్న జనపదం వైపు చూస్తున్నాడు. అతడలా చూసినప్పుడల్లా ఆ చూపుల్లో గౌరవం వెల్లి విరిసినట్టుంటుంది. అతను క్రిందకి చూచినప్పుడల్లా విసుగు, ముసుగులు లేకుండా కనిపిస్తుంది.

అతను పదిహేనోసారి తన చూపులను జనపదం వంక తిప్పేడు. అతనిలో ఒక చిత్రమైన అనుభూతి కనిపించింది. వాళ్ళున్న గుట్ట క్రింది మైదానం చూడగా చూడగా– వెనుకటిసారి చూచినప్పటికన్నా విశాలమైనట్టు కనిపిస్తోంది. దాని వెనుక బొమ్మరిళ్ళలానూ, పిచ్చిక గూళ్ళలానూ కనిపించిన వానిలో ఇప్పుడు వానర గృహాల పోలిక కనిపిస్తోంది. ఆ పెద్ద బొమ్మరిల్లు రాచసౌధమంటే నమ్మబుద్ధేస్తోంది. దాని ముందున్న మూర్తులలో వానరుల పోలికలేకాక నరుల పోలికలు కూడా ఈనాడు కనబడుతున్నాయి. దాని ముందు దానికెడంగా దాని మీది భాగంలో ఎక్కడో ఉన్న వాళ్ళనుద్దేశించి బొబ్బలు పెడుతున్న ఒంటివాని కంఠంలో ధాటీ అంతకంతకు హెచ్చుతున్నట్టున్నది. అన్నీ బాగానే ఉన్నాయి. కాని ఈసారి లోనుండి జవాబు రావడానికి వెనుకటికన్నా చాలా ఆలస్యమౌతోంది.

కారణం ఏమై ఉంటుందన్నది అతడు నిశ్చయించలేకపోతున్నాడు.

ఏమైనా కావచ్చు. వాడు సంగతి పసిగట్టి భయపడి ఉండవచ్చు. అలసి దానివల్ల పుట్టిన విసుగుచే అరచుకొని వాడే పోతాడు లెమ్మని ఊరుకొని ఉండవచ్చు. లేక తప్పతాగి ధూషణ, భూషణ, తిరస్కారాల కతీతమైన స్థితిలో నిరామయమైన నిద్రలో ఉండవచ్చు.

ఇంక యీరోజు కింతే ననుకుంటుండగా ఆ చివర సంచలనం కనిపించింది.

సౌధం ముందున్న జనం కలవరంపడి రెండుగా చీలి దారి యిస్తున్నారు. వారి నడుమ నుండి వస్తున్నాడు వాడు – మదించిపోయిన ఏనుగులా.

''అన్నా!'' – అన్నాడు రెండవ వాడు – అన్న వినిపించుకోలేదు. అని తన ఉత్కంఠకు సిగ్గిలినట్లు తరువాత వాక్యాన్ని ఉపసంహరించుకున్నాడు తమ్ముడు.

ఆవల–

ఒంటరివాడు కంఠం చించుకోవడం మాని వెనుదిరక్కుండా వెనక్కు నడుస్తున్నాడు. పిలుపంది వచ్చిన ప్రతిద్వంది సందడిలేని నడకలో ముందుకు వస్తున్నాడు. వెనక్కు నడిచే వాడి చేతిలో గద ఎత్తిపట్టి ఉన్నది. ముందుకు వచ్చేవాడి గద మూపున స్థిరంగా ఉన్నది. వాళ్ళ వెనుక జనం వాళ్ళను తగు దూరంలో అనుసరిస్తు న్నారు.

వాళ్ళంతా మైదానం నడుమ భాగంలోకి వచ్చాక ఆగిపోయారు. క్షణకాలం నిశ్శబ్దం, ఆ తరువాత ఒక పేద్ద బొబ్బ. తదుపరి మూక గొల్లుమన్నారు.

"అన్నా!" అన్నాడు సౌమిత్రి.

అన్నదమ్ముల పోరు ప్రారంభమయ్యాక అతడు అన్న వద్దకు వచ్చేశాడు.

శ్రీరాముడు తలయెత్తి ఇటు తిప్పి చూశాడు తమ్ముని వంక. తెలితమ్మి రేకుల్లా ఉన్నాయి. అతని పెదాలపై చిరునవ్వు ఏనాడో అంతరించి పోయింది. అతని చూపుల్లో ముందెన్నడూ కానరాని ఒక విలక్షణత కనుపించగా క్షణకాలం బిత్తరపోయాడు సౌమిత్రి.

ఆపాదమస్తకం తమ్ముని వంక ఒకసారి చూచి అటు తిరిగి పోయాడు శ్రీరాముడు.

"లేదు. తన తమ్ములెప్పుడూ సుగ్రీవులు కారు. తానెన్నటికీ వాలి కానేరడు."

శ్రీరాముడు చాలాసేపటికి వరకూ అలాగే ఉండిపోయాడు. ఆవల హోరు ఉండి ఉండి వినవస్తున్నది. అది విడిచి తక్కిన పరిసరమంతా నిశ్శబ్దంగా ఉన్నది.

కొంతసేపయ్యాక శ్రీరాముడు పోరువంక తిరిగాడు.

శ్రీరాముడు నాగరికుల నడుమ పోరాట మెరుగును.

ఆటవికులు తమలో తాము పోరాడుతుండగా చూడటం ఇదే మొదటిసారి.

వాళ్ళిద్దరి చేతుల్లోనూ గదలు లేవు. అవి ఎప్పుడో విరిగిపోయినట్టున్నాయి. వాళ్ళు లావుపాటి చెట్టు కొమ్మలతో అతి భయంకరంగా మోదుకుంటున్నారు. అది కూడా అయాక వాళ్ళు బాహాబాహీ కేశా కేశి ముష్టా ముష్టి పోరాడుతారు. నఖాలు దంతాలూ ఉపయోగించడం నిషిద్ధం కాదు.

అతడికా అన్నదమ్ములిద్దరూ పోరేతీరు కొత్తదే. కాని ఏ పోరులోనైనా పోరాడే వాళ్ళలో గెలిచేవాడి తీరెలా ఉంటుందో శ్రీరామునికి తెలియంది కాదు.

పోరులో వాలి ఆయాసపడడు. ఎదిరిని దెబ్బతియ్యడానికి ఉద్రేకపడడు. తనమీద పడే వేటులను అతి లాఘవంగా తప్పించుకుంటాడు. తాను నొచ్చినా నొవ్వనట్టే నవ్వుతుంటాడు. ఎదిరి మీది మీదికి వస్తే ఆవేశపడి పోడు. వెన వెనక్కు అడుగు వెయ్యడానికి సిగ్గుపడి పోడు. అదను చూచుకొని ఎదిరిని చావబాదుతాడు. హడలగొట్టి వెనక్కు తరిమి అతడు మళ్ళా ఆవేశపడి మీదకు వచ్చేవరకూ ఆగి ఉంటాడు. లాభం లేదు. సుగ్రీవుడు గెలిచే అవకాశం ఏమీ లేదు.

అడవుల పట్టినవాడు అష్టకష్టాలు పడుతున్నవాడు అన్యాయాలను తలంచుకొని ఆవేశపడే వాడు – అందునా తన బలంపై అపనమ్మకం ఎదిరి బలంపై చెరుగని నమ్మకం గలవాడు సుగ్రీవుడు –

ఆ క్షణం వరకు అష్టైశ్వర్యాలూ ఇష్టభోగాలూ అనుభవిస్తూ ఇరువంకలా ఇరువది మంది సుందరాంగనలు కొలువగా మత్తుగా తిని, చిత్తుగా త్రాగి పరిసులు వెంటనుండి జయ జయ ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లజేయ, యుద్ధభూమిని ప్రవేశించిన వాడు వాలి – వాలికి తానెన్నో సార్లు సుగ్రీవుని ఓడించిన విషయం గుర్తున్నది. ఇంక మరెన్ని సార్లయినా ఓడించగలనని ఆ యుద్ధంలో అతడు అడుగడుగునా తెలియజేస్తున్నాడు.

శ్రీరాముడు తల తిప్పి ఆవల ముఖుడైనాడు.

సుగ్రీవుని మంత్రి హనుమంతుడు అతి సమర్ధుడు.

'రాముడు సుగ్రీవుని సహాయం కోరి అతనిని వెదుక్కుంటూ వస్తున్నాడు' – అని లక్ష్మణుడంటే–

బలవంతుడైన అన్న తరిమివేయగా – ఋష్యమూకంపై తలదాచుకొంటున్న సుగ్రీవుడే – రాముని శరణుకోరి రావలసి ఉన్నాడన్నాడు హనుమంతుడు.

తమ్ముని భార్యను కూడా వాలి అపహరించాడన్నాడు. సుగ్రీవుడు కూడా భార్య వియోగం వల్ల బాధపడు తున్నాడన్నాడు. సమ దుఃఖంలో ఉన్న శ్రీరామునకూ సుగ్రీవునకూ మైత్రి సంఘటించాడు.

వాళ్ళిద్దరూ ఒకరికొకరు సహాయం చేసుకునేటట్టు ప్రమాణాలు చేసుకున్నారు.

ఆ తరువాత అన్నదమ్ముల నడుమ వైషమ్యానికి కారణం తెలిసింది.

వాలి మరీ అకారణంగా తమ్ముణ్ణి శిక్షించలేదు.

మాయావి అనే రక్కసునితో పోరాడటానికి ఒంటిగా పోతున్న వాలితో వారించినా వినకుండా సుగ్రీవుడు వెంటపడ్డాడు. రాక్షసుడొక గుహలో దూరి అదృశ్యుడయ్యాడు. ద్వారం వద్ద తమ్ముణ్ణి కాపుంచి లోనికి పోయాడు. సంవత్సరం కాసుకు కూర్చున్నాడట సుగ్రీవుడు. వాలి రాలేదు గాని రక్తపు వరదలొచ్చాయట.

అన్న మరణించి ఉంటాడని సుగ్రీవుడు నిజంగానే పొరబడి ఉండవచ్చు. ఆ రాక్షసునకు భయపడే అతడు బిలద్వారం మూసేసి ఉంటాడు. మంత్రులే బలవంతాన అతని పట్టాభిషేకం చేసి ఉంటారు. తిరిగి వచ్చాక వాలిని సుగ్రీవుడు క్షమాభిక్ష కూడా కోరే ఉంటాడు.

కాని వాలి కూడా పొరపడే అవకాశం ఉన్నది కదా!

రాక్షసుని చంపి అలసి వచ్చిన వాలికి ద్వారం మూసి ఉన్నది. నమ్మి కాపు ఉంచిన తమ్ముని శవం వెలుపల కనిపించలేదు. పెరిగే అనుమానాలతో కిష్కింధకు వచ్చిన వాలిని భృత్యులు కొందరు ముందుగా కలుసుకున్నారు. అంతః పురంలోనికి ప్రవేశించిన వాలికి తన స్థానంలో భోగాలు అనుభవిస్తున్న సుగ్రీవుడు కనిపించాడు.

వాలి – అన్న, ప్రభువు, ప్రతాపవంతుడు.

సుగ్రీవుడు – తమ్ముడు, కింకరుడు, పారబోతు.

రాజ్యాలను విడిచి వచ్చిన రాముని స్వంత దర్బారులో వాలి సుగ్రీవులకు సంబంధించిన నేర విచారణ ముగియక ముందే వాలి సుగ్రీవుల యుద్ధం ముగిసింది – క్రిందటిసారి.

అన్న ఆయుధాలతో చేసిన గాయాలు శరీరాన్ని – అప్పుడని నమ్మిన రాముడు ఆకారణంగా చేసిన మిత్రద్రోహం ఆత్మనూ క్షోభ పెడుతూండగా వచ్చి సుగ్రీవుడు రాముని ముందు నించున్నాడు. అతని వెంట వచ్చిన బంటులెవ్వరూ రాముని నిందించలేదు. కాని వారిలో చాలా మంది మృగాలు నరుని వంక చూసినట్టు చూశారు రాముని వంక.

రాముడు సుగ్రీవుణ్ణి రెండవసారి కూడా నమ్మించగలిగాడు.

కాని ఈసారైనా వాలిపై విల్లెత్తడమెలానో తెలియకుండా ఉన్నది – ఆ ధర్మ ప్రభువునకు. వాలి సుగ్రీవులు ఎక్కడో

మైదానం మీద పోరాడటం లేదు. వారిద్దరూ సున్నితమైన అతని హృదయకమలం మీదే అతి భీకరంగా క్రుమ్ములాడుతున్నారు.

శ్రీరాముడు సామాన్యుడైన మానవమాత్రుడు కాదు. అతను కారణజన్ముడు. రాజవంశాలలో అతి ప్రాచీనమైన సూర్యవంశంలో పుట్టాడతడు. ఇక్ష్వాకుల మాంధాత, సగరుడు, దిలీపుడు, భగీరథుడు, రఘువు, అంబరీషుడు మొదలైన ధర్మ పాలకుల రక్తమతనిలో ప్రవహిస్తున్నది. మునికుల శ్రేష్ఠుడు వశిష్ఠుని శిష్యుడతడు. అతనికా మాటల కర్థం తెలియక ముందు నుండీ అతనిని ప్రజలు ధర్మప్రభువని కీర్తిస్తూ వచ్చారు. ధర్మసంస్థాపన కవతరించిన మహామనీషియని విశ్వామిత్రుడతనికి ధర్మదీక్ష యిచ్చాడు.

అరణ్యవాసాన్ని వరియించిన రాముడు పితృవాక్య పరిపాలన ధర్మాన్ని మాత్రమే నిర్వహించడం లేదు. అతని చరిత్ర త్యాగానికే ఉదాహరణ. అతని జీవితం భ్రాతృ స్నేహానికి నిదర్శనం. అతడు విశ్వామిత్రుని యాగం కాచిన దక్షుడు. అతడు శివుని విల్లు విరిచిన ఏకైక వీరుడు. పరశురాముని గర్వమణచిన క్షత్రియ కుమారుడు. ఖరదూషణాదులను పెక్కెండ్రు నొక్కడుగా సంహరించిన మహాశూరుడు.

అట్టి శ్రీరాముడు తెలిసియో తెలియకో ఇరువురన్నదమ్ముల గృహ కలహంలో చిక్కుకున్నాడు. తన దుఃఖం కన్నులు కప్పడంవల్లో, యెదిరి దుఃఖానికి కన్నులు చెమ్మగిల్లడం వల్లో, అతడొక మైత్రీ ప్రమాణం చేసి ఉండవచ్చు. అయిన తనతో వైరం లేని వానిని – అందునా ఇంకొకనితో యుద్ధం చేస్తున్న వానిని – అన్నిటినీ మించి వెనుక పాటున – ఎలా చంపడం?

మూక గొల్లుమన్నది బయట. రాముడు త్రుళ్ళిపడి అటుకేసి చూశాడు. మూక మళ్ళా గొల్లుమన్నది.

వాలి సుగ్రీవులు యింకా పోరాడుతూనే ఉన్నారు.

దూరాన్నుండి చూస్తున్న రామునికి సుగ్రీవుని కదలికల్లో అలసట కనిపిస్తున్నది. లక్ష్మణుడికి అతడింకెంతో సేపు పోరాడలేడని తెలుస్తున్నది. ప్రాణభయంతో సుగ్రీవుని శరీరం గజగజలాడుతున్నదని చుట్టూ నిలిచి చూస్తున్న వానరులంతా గుర్తించారు. ఎడం దొరకినప్పుడల్లా అతడు విహ్వలతతో దశ దిశలూ చూస్తున్నాడు. వాలి సందిస్తే చాలు అతడు మళ్ళా పిక్కబలం చూపి పారిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అతని శరీరం ముచ్చెమటలూ పోసేస్తున్నది. శరీరంలో ప్రతి అంగుళం వాలి చేసిన గాయాలతో ఎర్రనై ఉన్నది. వాడు ఉండి ఉండి తన వానర ముఖం నుండి స్రవించే రక్తధారలను తన వానర హస్తాలతో తుడుచుకుంటున్నాడు. అలా ఆ రక్తాన్ని చూచినప్పుడల్లా అతడి కండ్లు క్రొత్త క్రోధంతో మెరిసి పోతుంటాయి. నాభి కట్టడుగు నుండి వెలువడే ఘర్జనల నాపుకోవడంలో ఆ వానరుడు తన వదనాన్ని మరీ వికృతం చేసుకుంటున్నాడు. లోన ఘూర్ణిల్లి ఘూర్ణిల్లిన ఘర్జారావం ఒక్కొక్కప్పుడు అన్ని ఆటంకాలను దాటుకొని ఒక్క అదటున మార్మోగుతుంటుంది. అట్టి సమయాల్లో ఆ ఘర్జనలతో పాటు అతడు కూడా ముందుకురుకుతుంటాడు. వాలి అట్టి అదనుల లోనే మర్మాంతకమైన దంభోళి వంటి ఒక్క ఘాతంతో సుగ్రీవుని నేల కూలుస్తూ ఉంటాడు.

వాలి సుగ్రీవుల పోరులో ఒక చిత్రాన్ని గమనించాడు శ్రీరాముడు.

మైదానం నడుమ చిక్కిన ఎలుగును చుట్టి పోరాడే చిరుతలా వాలి సుగ్రీవుని చుట్టూ తిరుగుతుంటాడు. బరి మీద నాగుతో పోరాడే గడితేరిన ముంగిసలా అతడు తమ్ముడిపై కురుకుతూ ఉంటాడు.

అవకాశం చిక్కినా అతడు శత్రువును అణచడానికి ప్రయత్నం చెయ్యడం లేదు. సమయం చిక్కినా అతడు సుగ్రీవుణ్ణి చంపడానికి ప్రయత్నం చెయ్యడు.

'ఎందుచేత?'

– అని ప్రశ్నించుకున్నాడు శ్రీరాముడు.

అన్నలు క్షమించలేని మహా ద్రోహమేమీ చేయలేదు సుగ్రీవుడు. ఉదారబుద్ధిగాని వాత్సల్యం గాని ఉంటే ఎంతటి పాపాన్నయినా క్షమించవచ్చు. బలవంతునకు దుర్బలునితో స్పర్ధ ఉండదు.

ఆటవిక సంబంధమైన సజాతి వైరమది. క్రూర మృగ సంబంధమైన అహంకృతి అది.

అడవిలో బలమైన జంతువు బలవత్తరమైన జంతువుకు తొలగిపోవాలి. దేని వేట అన్నది అవి ఆలోచించవు. అవతలి దాని ఆకలి దీనికి పట్టదు. బలం గౌరవింపబడుతున్నదా బలం లేదా అన్నదే ప్రశ్న.

క్రూర జంతువులకు మాత్రమే సహజమైన యీ దౌష్ట్యం వాలిలో పరాకాష్టనందు కొన్నది. వానిలో ఏ క్రూర మృగానికీ ఉండనిదీ – మానవుని పాలిట వరం దానవుని పాలిట శాపంగా పరిణమించేదీ – అయిన ఆలోచనా శక్తి ఉన్నది. దానిని ఉపయోగించి అతడు బలవంతమైన ఏ క్రూరమృగమూ దుర్బలమైన ఏ యితర మృగాన్నీ హింసించలేని విధంగా సుగ్రీవుణ్ణి హింసిస్తున్నట్టు కనిపించదు. జంతువుకైనా నరునికైనా అన్నింటిలోకి అత్యంత సున్నితమైనదీ దెబ్బనోర్వలేనిదీ అయిన పట్టేదో వాడెరుగును. అందుచేత రుమను వాడు అంతఃపురంలో పట్టి ఉంచాడు. రుమ కోసం సుగ్రీవుడు వాలి మీద కత్తి పడతాడు. మళ్ళా మళ్ళా ఓడి మళ్ళా వాలితో యుద్ధం చేస్తాడు. బలహీనుడైన సుగ్రీవుణ్ణి

బలవంతుడైన వాలి యెన్నిసార్లయినా ఎప్పుడైనా ఓడించగలడు.

కాని చంపడు.

వేవురు కాంతలు గల వాలికి, కాంతా శిరోమణియైన తార దారగా గల వాలికి, రుమ యేల కావలసి వచ్చింది?

రుమ అంతఃపురంలో తన కళ్ళ ముందు లేకపోతే సుగ్రీవునితో యుద్ధాల్లో వళ్ళు పులియబెట్టుకోవడం వాలికి ఆనందమివ్వనే యివ్వదు.

రుమ అడవిలో సుగ్రీవుని కళ్ళ ముందుంటే బలవంతుడైన వాలి యెడల మళ్ళా మళ్ళా అతడు అపచారం చేసే అవకాశం ఉండదు.

అపరాధియైన సుగ్రీవుని ఆ తరువాత తనకెప్పుడు బుద్ధిపుడితే అప్పుడు, ఎలా వీలైతే అలా లీలగా చంపి కూడా అవుననిపించుకోవచ్చు.

లోకంలో దుష్టులందరూ యిలానే తాము చేయబోయే దౌష్ట్యానికి నేపథ్యం సృష్టిస్తారా సృష్టించుకుంటారా అని ప్రశ్నించుకున్నాడు శ్రీరాముడు.

అతని ఆత్మ విమర్శ కడముట్టక ముందే వెలుపల జయ జయ ధ్వానాలు మిన్నుముట్టాయి.

కుడిచేత అమ్ము, ఎడమచేత విల్లుతో ఒకఅడుగు అటుకేసి మైదానం కేసి చూశాడు శ్రీరాముడు. దాని నడిమి భాగంలో వెనుదిరిగి నించున్నవాడు సుగ్రీవుడు కాడు. ఆ వెనుకభూమిని కరచుకు పడి వున్న వాడే సుగ్రీవుడు. ఆ వెనకనున్న వాలి భృత్యులూ ఇతర వనచరులూ తయ్యిమని కేకలు వేసి గెంతుతున్నారు.

రాముని చూపులు బలిష్ఠమైన వాలి మూపు మీద నిలిచినవి. వాడు నిజంగానే బలవంతుడు. ఆ బలానికి తోడు వరబలం కూడా ఉన్నదని సుగ్రీవుడంటాడు. రామునికా విషయమందు నమ్మకం చిక్కీ చిక్కకుండా ఉన్నది.

అకస్మాత్తుగా మైదానం నిశ్శబ్దమయ్యింది.

అటు చూసిన రామునకు క్రింద పడి ఉన్న సుగ్రీవుడు నెమ్మదిగా లేవడం కనిపించింది. అతడు మోకాళ్ళ మీద కూర్చుని క్షణకాలం అలాగే ఉండిపోయాడు. తరువాత తల ఎత్తి ఎటుకేసో చూడబోయాడు. ఎటుకేసి చూడటమో జ్ఞాపకం రాక ఆకాశంకేసి చూశాడు. తల బరువు కాగా మెడ వేలవేశాడు.

తరువాత కొన్నిక్షణాలు–

సుగ్రీవుడు కూలిపోలేదు.

ఏ తలపులు ఆవేశాలనిచ్చి ఆశలు వానికి జీవం పోశాయో తెలియదు. అది తల విదిలించుకొనగా సుగ్రీవుడు లేచి నించున్నాడు.

తరువాత పోరులో సుగ్రీవునిది ముందు చూపే కాని వెనుకచూపు లేదు. ప్రాణం పోవడమంటే ఏమిటో తెలిసిన సుగ్రీవునకు ప్రాణభయం పోయింది. తోడ్తోడనే అతడు పోరే తీరు మారింది.

ఎప్పట్లానే వినోదిస్తున్న వాలికి అకస్మాత్తుగా సుగ్రీవుని మొహం విలక్షణంగా కనిపించింది. అతడు నిమేష కాలం విస్తుపోయాడు. ఆ తరువాత క్షణక్షణం గుణించక పోతున్న సుగ్రీవునిలో శక్తి విజృంభణాన్ని గుర్తించాడు అంతే! అతడింకొక్క క్షణం కూడా వృధా పుచ్చలేదు. ఒక్క పెడబొబ్బ పెట్టి పోయి సుగ్రీవుని ఒడిసి పట్టుకున్నాడు.

వాలి పెట్టిన ఆ బొబ్బకు వనమల్లా ప్రతిధ్వనించింది.

వనంలో ఉన్న ఆ తరువులన్నీ ఇతోధికంగా సావధానములయ్యాయి.

సుగ్రీవుని చూపులను వాలి చదివినట్లే వాలి బొబ్బను రాముడు సూటిగా గుర్తుపట్టాడు.

అప్పుడు కాని అతని చేతి నలంకరించిన ధనుర్బాణాలు ముందుకు రాలేదు.

ధనువు నెత్తిన రాముని చెవికొక్క కోటి కంఠాలు వినిపించాయి.

ఆలి కోసం రాముడు అన్నదమ్ముల పోరాటంలో తమ్ముని చేరి అన్నను చంపుతున్నాడన్నాయి.

వీరాగ్రేసరుడనని విర్రవీగే రాముడు శూరత్వం విడచి భీరువై ధర్మం చెడి చెట్టుచాటున చేరి ఒక చిన్న కోతిని మట్టుబెట్టుతున్నాడన్నాయ్.

అంతవరకూ తమ నడిబొడ్డున జరుగుతున్న ఆ పోరాటాన్ని నిక్కి నిక్కి నిటారుగా, ఏ వంకకూ తలల చివరలైనా ఊపకుండా అతి నిర్లిప్తతతో చూస్తూ ఉండిన ఆ మహావృక్షాలన్నీ క్షణంలో శివమెత్తినట్లు మొదళ్ళను సహితం కదుపుకొని ఊగిపోతూ హోరుహోరు మంటున్నాయి. ఆ అదటుకి అరణ్యంలో ఉండే క్రూర సత్వాలన్నీ పిచ్చెత్తినట్టు బొబ్బరిస్తూ అరణ్యమల్లా పరుగులు తీశాయి. వాటిని చూచి, ప్రాణభయంతో సాధుసత్వాలు విరిగి బెదిరి కలవరపడి కల్లోలమై కలసి పరుగులు పెట్టాయి.

లక్ష్యమునందు లగ్నమైపోయిన శ్రీరాముని దృష్టికి వెలుపలి అరణ్యమంతా ఏమై పోతుందో కనిపించడం లేదు. ఆ వెలుపల నాగరిక ప్రపంచమంతా ఆ తరువాత ఏమని అరవగలదో వినిపించలేదు.

అతనికి కనిపిస్తున్నదల్లా వాలిలో మూర్తీభవించిన క్రౌర్యం, దౌష్ట్యం, మధాంధత గర్వం. అతనికి వినిపిస్తున్నదల్లా సుగ్రీవుని కంఠంలో అణచి వేయబడుతున్న ఆర్తనాదం.

ఒసిలి ఒసిలి ఒక్క అదటున తప్పించుకొన్నాడు

సుగ్రీవుడు. అతనిపై కురుకనెగిరిన వాలి అలానే వెనక్కి తూలి నేల కూలాడు.

రాముని బాణం గుండెను నాటి అటు ప్రాణాలను తియ్యకుండా, అవి ఎప్పుడు పోతాయో తెలియకుండా – హింసా స్వరూపమెట్టిదో దానివల్ల పుట్టే బాధ ఎంత తీవ్రమైనదో – భోగ పరాయణములైన వాలినవ నాడులకూ తెలియచేస్తున్న వేళ – అతి కుతూహలంతో నిండిన రాముని విశాల లోచనాలలోకి చూస్తూ వాలి అన్నాడు.

"రామా! నీవు ధర్మం తప్పిన రాజనామకుడవు. నువ్వు ధనువు చేతపట్టిన కిరాతకుడవని నేను కలలో కూడా ఊహించలేకపోయాను".

రాముడా ఆరోపణలకు కినియలేదు. సమాధానం చెప్పలేదు.

కాని వాలి విడువలేదు. అతడు గొంతుతోనే కాకుండా కాకువుతో రెట్టిస్తూ అడిగాడు.

"చెప్పు, నువ్వు సీత కోసమే యీ అధర్మానికి ఒడిగట్టావు, అవునా!"

ఈసారి రాముడు మౌనం వహించలేదు.

"ఓయీ నీకు ధార్మికుల స్వభావం తెలియదు. లోకమంతా నీ బోటివారే అనుకుంటావు. స్వార్థానికతీతులుగా మనుష్యులు ప్రవర్తించగలరంటే నీవు నమ్మవు."

"అదే నిజమైతే నీకు స్వయంగా అపచారం చెయ్యని వానిని, అన్యునితో పోరాడే వానిని వెనుకమాటున పొంచి ఎలాచంపావ్?"

ఈ ప్రశ్న విన్న రాముని అంతరంగంలోని సంచలనం వర్ణనాతీతం. అతడు వాలి ముఖంలోకి తదేక దీక్షగా చూచి చూచి జవాబిచ్చాడు.

"ఓయీ యింత వరకూ నీ దుష్టత్వాన్నీ నీ చర్యలనే సాక్షులుగా తీసుకొని గ్రహించాను. ఇప్పుడు నీవు వేసిన యీ ప్రశ్న నా సందేహాలను తీర్చివేసింది.

నిజంగానే నీవు దుష్టుడవు.

సుగ్రీవుడికైనా నువ్వు అపకారం చెయ్యలేదు. అతణ్ణి హింస పెట్టావు. అపకారం చేసిన వాళ్ళనూ, తప్పు చేసిన వారినీ వీలువెంబడి శిక్షిస్తారు. దుష్టులను తక్షణం వధిస్తారు.

నా విషయంలో కూడా నువ్వు నీ స్వభావాని కనుగుణంగానే ఆలోచించావు. నీ బలం నువ్వు గుర్తుంచు కుంటూనే నా బలహీనత ఎక్కడో గ్రహించావు. ఎదురబడి పోరాడడానికి వరబలం వల్ల నీ వజేయుడవు. వెనుక నుండి కొట్టడానికి నేను నమ్మిన ధర్మాలే నా పాలిట శృంఖలాలై వర్తిల్లగలవని భావించావు. నీ ఊహా సరియైనదే.

కానీ–

దుష్టులీవిధంగా శిష్టులు నమ్మే ధర్మాలనే వాళ్ళకవరోధాలుగా భావించి విజృంభించి నపుడు, ఆ ధర్మాలను అతిక్రమించడానికి వెనుదీయడమే ధర్మాతిక్రమణ మవుతుందని నాకు ధర్మదీక్ష నిచ్చిన మహర్షి, మా అస్త్ర గురువులు, తాటకనునాచే సంహరింప చేసిన వేళ ఉపదేశించారు.

దుష్టుడవైన నీవు, తుచ్ఛమైన నీ శరీరాన్ని రక్షించుకోవడానికి పడిన జాగ్రత్తలోనే నిన్ను చంపాలనే వారు నన్నే విధంగా ఎదుర్కొని చంపవలసి ఉంటుందో ఆ వైనమంతా ఏర్పాటు చేసి పెట్టుకొన్నావు.

నీవు దుష్టుడవనడానికి ఇంకొక్క ప్రబల నిదర్శనమున్నది. సర్వ జీవరాశులకూ ప్రాణాలపై తీపి ఉంటుంది. దుష్టులకు ప్రాణాల విషయంలో ప్రత్యేకమైన భయం ఉంటుంది. అందుచేత నీవు అజేయత్వాన్ని కోరి వరాన్ని పొందావు".

రాముడీ విధంగా అనగా వాలి మరి మాటాడలేదు. కొంతసేపు ఊరుకొని పశ్చాత్తాపం ప్రకటించే ముఖంతో అన్నాడు.

"రామా! నేను నీ సంగతి గ్రహించలేక పోయాను. నీచేత మరణించడం వల్ల నేను ఈ లోకానికి దూరమైనా ఆ లోకానికి దగ్గరయ్యాను".

– అంటూ వాలి కన్నుమూశాడు.

చస్తూ చస్తూ కూడా వాలి చేసిన ఘనకర్మ మర్మం రాముడు గ్రహించి ఉండవచ్చు లేక గ్రహించక పోవచ్చు.

కాని–

వాలిని ఈనాటికీ చిరంజీవిని చేసినది ఆ చివర అతడు చేసిన ఆ పశ్చాత్తాప ప్రకటనే! ★

*(విశాఖ – విశాఖ రచయితల ద్వైమాసపత్రిక – 1965 రిపబ్లిక్ సంచిక)*